పేద ముస్లింలకు రంజాన్ కిట్లు



రంజాన్ కిట్స్ అందజేస్తున్న మణికంఠగౌడ్

మేడ్చల్: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మేడ్చల్ మున్సిపల్ 6వ వార్డు మాజీ కౌన్సెలర్ రామన్నగారి మణికంఠ గౌడ్ వెయ్యి మంది మైనార్టీలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతోనే పేద ముస్లింలకు సరుకులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షుడు పాషా, కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు రఫిక్, ఇనాయిన్, ఆరిఫ్, ఖాన్, అష్రఫ్, అజ్మత్, రఫిక్, మోనార్క్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సీఈ కళాశాలలో ఉగాది వేడుకలు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఉగాది వేడుకలను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ సెల్ ప్రతినిధి డా.వై.సరిత కుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉగాది పండగ విశిష్టత, షడ్రుచుల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అశోక్ పలువురు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్దమర్రి గ్రామస్తుడికి డాక్టరేట్



జహంగీర్

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామానికి చెందిన నెల్లుట్ల జహంగీర్‌కు డాక్టరేట్ లభించింది. శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన బిట్స్‌పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో శనివారం పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

ట్రేడ్ మార్క్ దుర్వినియోగం చేస్తే చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోని ప్రముఖ పాదరక్షల బ్రాండ్.. మెట్రో తమ రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్క్‌లను చట్టవిరుద్ధంగా ఉపయోగించడంపై కఠిన చర్యలను తీసుకోనుంది. ఈ విషయాన్ని బ్రాండ్ వైస్ ప్రెసిడెంట్ దీపా సూద్ తెలిపారు. ఈ క్రమంలోనే స్థానిక ప్రభుత్వ అధికారులతో కలిసి నగరంలోని మెట్రో మిరాకిల్‌పై తాజాగా దాడులు నిర్వహించామని, ఈ దాడిలో మెట్రో ట్రేడ్ మార్క్‌లను కలిగి ఉన్న పలు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. మా ట్రేడ్‌మార్క్‌లను దుర్వినియోగం చేయడానికి ప్రయత్నించే ఎలాంటి సంస్థ అయినా కఠినమైన చర్యలు కొనసాగించనున్నట్లు వివరించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కుషాయిగూడ: నిరుద్యోగ యువతి, యువకులకు టెక్ మహేంద్ర సహకారంతో క్యాడర్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణతో పాటుగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల పాటు ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ టైపింగ్, సాఫ్ట్ స్కిల్స్, ట్యాలీ, ఇంటర్వ్యూ స్కిల్స్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ పాసై 18-27 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈసీఐఎల్‌లోని టెక్ మహేంద్ర ఫౌండేషన్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చవన్నారు. వివరాల కోసం ఫోన్: 91000 56583.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఉప్పల్: ఉప్పల్ డివిజన్ శేషసాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. వైద్య శిబిరాలు పేదలకు వరమని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు మోహన్‌రెడ్డి, నరసయ్య, బీమా నాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, విప్లవ్‌రెడ్డి, ప్రశాంత్, నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెంపు లక్ష్యం

ప్రజలపై భారం లేకుండా.. ట్రేడ్ లైసెన్సు, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లపై కార్యాచరణ

- నగరానికి సమాంతరంగా శివారు పురపాలికల్లో వసతుల కల్పనపై చర్యలు
- మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని పురపాలికల్లో ఆదాయానికి గండి కొడుతున్న ఉద్యోగులపై కన్ను
- పట్టణాల్లో పన్నుల రాబడి రూ.343 కోట్ల నుంచి రూ.400 కోట్లు పెంపునకు కసరత్తు



పీర్జాదిగూడ నగర పాలక సంస్థ కార్యాలయం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ శివారు పురపాలికల్లో ఆదాయం పెంపుతో పట్టణవాసులకు మహానగరానికి సమాంతరంగా మౌలిక వసతుల కల్పనకు అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయ, వ్యయాలు, ఇతర రాబడుల విషయంలో సమీక్షిస్తున్న పురపాలక సంఘాలు.. రానున్న 2025-26 ఆర్థిక సంవత్సరంలో పన్నుల రాబడి, ఆదాయ, వ్యయాల కసరత్తుతో అభివృద్ధి విషయాలపై ప్రత్యేక దృష్టితో ముందుకు సాగాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజలపై భారం పడకుండా.. ఆదాయ వనరుల సమీకరణ లక్ష్యంగా పురపాలికల్లో సంపద పెంచడం కోసం అధికార గణం ట్రేడ్ లైసెన్స్, ఖాళీల స్థలాల పన్ను(వెకంటీ టాక్స్)లపై కార్యాచరణకు సిద్ధమవుతోంది.

గండి కొడుతున్న ఉద్యోగులు

శివారు పురపాలికల్లో ప్రస్తుతం వివిధ పన్నుల ద్వారా రాబడి రూ.343 కోట్లు ఉండగా, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో రూ.400 కోట్లకు పెంచాలని భావిస్తోంది. నగర శివారుల్లో 29 పురపాలక సంఘాలు ఉండగా, ఇటీవల అవుటర్ రింగ్ రోడ్ పరిధిలో ఉన్న 40 గ్రామ పంచాయతీలు సమీపంలోని 11 పురపాలక సంఘాల్లో విలీనమయ్యాయి. గ్రేటర్ శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలక సంఘాల్లో ఆదాయ మార్గాలు పెంచుకోవడానికి అన్ని రకాల వనరులను వినియోగించుకోవాల్సి ఉన్నా.. దానికి కొందరు ఉద్యోగులు గండి కొట్టేలా వ్యవహరిస్తున్న తీరుపై కూడా కన్నేయాలని భావిస్తోంది. పురపాలికల్లో ఇప్పటికే కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటే అనుమతులు, ఇంటిపన్ను, నల్లా పన్నుల మదింపు వంటివి చేస్తుండటంతో పాటు వాణిజ్య, వ్యాపార సంస్థల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ జారీ చేయడం తప్పనిసరి చేశారు. ట్రేడ్ లైసెన్స్ జారీలో పలువురు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించడం వల్ల లక్ష్యానికి తగ్గట్టుగా ఆదాయం రావడం లేదు. ఖాళీ స్థలాల పన్ను విధింపుతో కొంత మేరలో ఆదాయ వనరులను పెంచవచ్చని అధికార యంత్రాంగం యోచిస్తోంది.

ఫీజుతో పాటు అదనంగా..

గ్రేటర్ శివారులో 29 పురపాలక సంఘాల పరిధిలోని దుకాణాలు, హోటళ్లు, ఆస్పత్రులు ఇతర షాపింగ్ మాల్స్ వంటి అన్ని రకాల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ అవసరముంది. వీరంతా ఆన్‌లైన్ తర్వాత అనుమతులు పొందుతున్నారు. రహదారులను బట్టి పొడవు, వెడల్పుల ఆధారంగా పన్ను వసూలు చేయాలి. కానీ నగర శివారు పరిధిలో పదుల సంఖ్యలో వాణిజ్య దుకాణాలు ఉండగా పొడువు, వెడల్పు కొలతలు లేకుండానే రూ.వెయ్యి చొప్పున నిర్ణయించి, అదనంగా ఒక్కో దుకాణానికి రూ.700 వసూలు చేస్తున్నట్లుగా సంబంధిత దుకాణదారులు ఆరోపిస్తున్నారు. ఇతర వ్యాపార సముదాయాల ట్రేడ్ లైసెన్సుల జారీలోనూ ఇదే తరహాలో వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ట్రేడ్ లైసెన్సు జారీ ఇలా..

నగర శివారులో వ్యాపారం నిర్వహించాలంటే.. పురపాలక సంఘానికి రుసుం చెల్లించి ట్రేడ్ లైసెన్సు పొందాలి. రుసుం విధింపులో ఇటీవల కొత్త విధానం అమల్లోకి వచ్చింది. చదరపు అడుగుకు రూ.5 చొప్పున నిర్ణయించారు. సాధారణంగా షోరూంలు, మిల్లులు, సరుకు నిల్వ చేసే హోల్‌సేల్ వర్తకుల భవన సముదాయాల విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది. కొత్త విధానంలో మదింపు చేస్తే వీరు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. కొందరు రుసుం తక్కువ ఉన్న సమయంలో లైసెన్సు పొంది తిరిగి పునరుద్ధరించుకోవడం లేదని తెలుస్తోంది.

పాఠశాలకు కొత్త భవనాన్ని నిర్మించాలి



ఎంపీ ఈటలకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మునీరాబాద్ గ్రామంలో శిథిలమైన పాఠశాల భవనానికి నిధులు కేటాయించాలని బీజేపీ మండల నాయకులు ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. మునీరాబాద్‌లో 40 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనంలోనే పాఠశాల కొనసాగుతోందని, ఎన్నిసార్లు విన్నవించినా పాలకులు పట్టించుకోలేదని ఎంపీకి బీజేపీ నాయకులు వివరించారు. నిధులు మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మించేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో మునీరాబాద్ మాజీ సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, మల్లికార్జున్ ముదిరాజ్, హేమారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి.. ప్రకృతిని కాపాడి..



మొక్కలు నాటుతున్న రాఘవేందర్‌యాదవ్ తదితరులు

కీసర: ప్రకృతి విలయాల నుంచి తప్పించుకునేందుకు తప్పకుండా ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని గ్రీన్ ఇండియా చాలెంజ్ కో- ఫౌండర్ రాఘవేందర్‌యాదవ్ అన్నారు. కీసరలోని వీఆర్ సెరినిటీ పాఠశాల ఆవరణలో మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ గ్రీన్ చాలెంజ్ హరిత సేనలో భాగంగా మహిళా విభాగం అధ్యక్షురాలు నాయకపు మాధురి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి శనివారం మొక్కలు నాటారు. పాఠశాల కరస్పాండెంట్ పి.రాజిరెడ్డి, హరితసేన సభ్యులు అమృత్‌లాల్, చౌహన్, సతీష్, జగన్‌మోహన్, జోజ నారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి ఆహ్వానించకుండా ముదిరాజ్‌లకు అవమానం



ఘట్‌కేసర్‌లో సమావేశమైన ముదిరాజ్‌లు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో నిర్వహించ తలపెట్టిన బొడ్రాయి పండగ నిర్వాహణపై జరిగిన సమావేశానికి ముదిరాజ్ సంఘం నాయకులను పిలవకపోవడం సబబు కాదని ఆ సంఘం మున్సిపల్ అధ్యక్షుడు బర్ల కిష్టయ్యముదిరాజ్, ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన శ్రీశైలం, బర్ల ఆంజనేయులుముదిరాజ్ అన్నారు. పట్టణంలోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో ముదిరాజ్‌ల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 27న నిర్వహించిన సమావేశానికి అన్ని కులాల పెద్దలను ఆహ్వానించారని, ముదిరాజ్ పెద్దలను పిలవకుండా అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని కుల సంఘాల పెద్దలతో పాటు ముదిరాజ్ పెద్దలను పిలిచి తిరిగి సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాధాకృష్ణ ముదిరాజ్, దేవేందర్ ముదిరాజ్, చంద్రశేఖర్‌ముదిరాజ్, నరేశ్‌ముదిరాజ్, పోచయ్యముదిరాజ్, వెంకటేశ్ ముదిరాజ్, నర్సింగ్‌రావు ముదిరాజ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ సిబ్బంది



మహిళను తీసుకెళ్తున్న పోలీస్ బలగాలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్, బీజేఆర్‌నగర్, సంతోష్‌నగర్, లక్ష్మీ నర్సింహస్వామి కమాన్ ఎదురుగా నిర్మించిన పలు అక్రమ నిర్మాణాలను కాప్రా తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో రెవెన్యూ, కేంద్ర పోలీస్ బలగాలు, స్థానిక పోలీస్ సిబ్బందితో కూల్చివేయించారు. జవహర్‌నగర్‌లో ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని, ఇంటి పన్నులు, నల్లా బిల్లులు ప్రభుత్వానికి చెల్లిస్తున్నామని చెప్పినా అధికారులు వినకుండా పోలీసు బలగాలతో మహిళలు, పలువురు యువకులను ఈడ్చుకుని తీసుకెళ్లి కూల్చివేయించారు. కూలి చేసుకొని కట్టుకున్న ఇంటిని కూలిస్తే తాము ఎక్కడ ఉండాలి.. ఎలా బతకాలి అని ప్రభుత్వాన్ని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వీరేంద్రసాయి, సిబ్బంది రవి, సాయి, కాశీరాం, నర్సయ్య, రమేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి



రాచకొండ డీసీపీ పద్మజను కలిసిన దమ్మాయిగూడ కాంత్రి కీన్ స్కూల్ విద్యార్థులు

కీసర: విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాచకొండ డీసీపీ పద్మజ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని క్రాంతి కీన్ స్కూల్ విద్యార్థులు డీసీపీ పద్మజను శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల ఆర్ఎంఎస్ తెలంగాణ రాష్ట్ర టాపర్‌గా ఎంపికైన జే.వైష్ణవిని ఆమె అభినందించారు. వచ్చేనెల 5న జరగనున్న సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కల్యాణి, డైరెక్టర్ లావణ్య, హెచ్‌ఓడీ మిస్టర్ జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం



కీసర: కరీంగూడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం 75 సంవత్సరాల పాఠశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవం పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, మండల విద్యాధికారి జి.శశిధర్, జిల్లా విద్యాశాఖ ఏఎంఓ రవీందర్‌రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీ.శ్రీధర్, ఆప్స్ చైర్మన్ మంజుల, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్ సాయికృష్ణ ఎన్‌క్లేవ్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో ఎన్నో ఏళ్లుగా డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, సరైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫోన్ చేసి కాలనీలో పర్యటించి అవసరమైన పనులకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు డోకూరి మధుసూదన్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు మురళీ, విజయ్‌ప్రకాష్, అశ్విన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉగాది కవిసమ్మేళనం

మేడ్చల్‌రూరల్: ఉగాది పండగను పురస్కరించుకొని జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. మేడ్చల్ పట్టణంలోని హనుమాన్ దేవాలయం, శ్రీవెంకట్రామయ్య కాలనీలో జరిగే ఈ కవి సమ్మేళనానికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారని నిర్వాహకులు తెలిపారు. కవి పండితులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ సాహిత్య పరిషత్ మేడ్చల్ శాఖ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం కోరారు.

కారు ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి



జాషువా(ఫైల్)

పోచారం: కారు ఢీకొనడంతో బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన దండు జాషువా(18) తార్నాకలోని మాణికేశ్వరినగర్‌లో ఉంటూ నారపల్లిలోని సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సం చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి కొంత మందితో కలిసి కొర్రెముల్‌లోని రుద్రా కన్వెన్షన్‌లో క్యాటరింగ్ పనికి వెళ్లాడు. అదే రోజు అర్ధరాత్రి దాటిన తర్వాత మిత్రుడి వద్దకు వెళ్లేందుకు గణపతి హాస్టల్‌వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. సిద్దార్థ ఐటీఐ వద్దకు రాగానే కొర్రెముల్ నుంచి నారపల్లి వైపు వేగంగా వెళ్తున్న కారు జాషువాను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం కోసం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి దండు అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



అవార్డులు అందజేస్తున్న ప్రో చాన్స్‌లర్ నర్సింహారెడ్డి, ప్రెసిడెంట్ అభిజిత్‌రావు, డీన్ కార్తికేయన్



ప్రేక్షకులను అలరిస్తున్న గాయకుడు కార్తీక్

ఘనంగా శ్రీనిధి యూనివర్సిటీ ఫౌండర్స్ డే

పోచారం: శ్రీనిధి యూనివర్సిటీ మొదటి వ్యవస్థాపక దినోత్సవాన్ని యంనంపేట్‌లోని యూనివర్సిటీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రో చాన్స్‌లర్ డాక్టర్ పి.నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు, నాయకత్వ లక్షణాలతో విద్యార్థులు ముందుండాలన్నారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డులు, సహపాఠ్యాంశాలతో పాటు క్రీడల్లో రాణించిన వారికి చాంపియన్స్ ట్రోఫీ అందజేశారు. విద్యార్థుల డ్యాన్స్‌లతో పాటు ప్రముఖ గాయకుడు కార్తీక్ నిర్వహించిన సంగీత ప్రదర్శనలు చూపరులకు వినోదం పంచాయి. ప్రేక్షకుల కేరింతలతో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా కొనసాగింది. యూనివర్సిటీ ప్రెసిడెంట్ అభిజిత్‌రావు, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డా.ఎం.కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో రాజకీయం తగదు



మల్కాజిగిరి: ప్రజాసేవలో రాజకీయం తగదని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ అన్నారు. వేసవిలో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు మల్కాజిగిరి చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించారు. ఈ ఘటనపై జగదీష్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల దౌర్జన్యం మల్కాజిగిరిలో పెరిగిపోయిందన్నారు. చలివేంద్రం తొలగింపుపై డిప్యూటీ కమిషనర్‌ను ప్రశ్నిస్తే ఇందిరా గాంధీ విగ్రహానికి అడ్డుగా ఉందని ఫిర్యాదు చేశారని తెలిపారన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసి వారం రోజులు గడిచినా జలమండలి అధికారులు నీటిని సరఫరా చేయలేదన్నారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తి కావడంతో శనివారం ప్రారంభిస్తానని ఎమ్మెల్యే చెప్పారని, ఇంతలోనే చలివేంద్రం తాత్కాలిక షెడ్డును తొలగించారన్నారు. చలివేంద్రం తొలగించిన ప్రాంతాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు వెంకన్న, పరశురామిరెడ్డి, రావుల అంజయ్య పరిశీలించారు.

అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరాలకు చెక్



ప్రశంస పత్రం అందజేస్తూ..



5కె రన్ ప్రారంభిస్తున్న వజ్రేష్‌యాదవ్

టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్‌లో భాగంగా సిమ్‌లైన్ ఫిట్‌నెస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 5కె, 3కె, 2కె రన్ ఫర్ ఫిట్‌నెస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందిందో అదేవిధంగా సైబర్ ఆర్థిక నేరాలు జరుగుతున్నాయన్నారు. ఎక్కువగా యువతీ యువకులే మోసపోతున్నారన్నారు. వాటి పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ వ్యాయామం అలవాటు చేసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు ఆహార నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, సిమ్‌లైన్ ఫిట్‌నెస్ జిమ్ చైర్మన్ జయసింహగౌడ్, నాయకులు హరినాథ్‌గౌడ్, శ్రవణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.